# తెగని బంధం

ఇసుకపల్లి లక్ష్మీనరసింహశాస్త్రి

'ఉత్తరం వ్రాయటానికేముందీ మీదంతా మరీ యిది...' సుజాత, మధు పడుకున్న పడక కుర్చీ వెనకవైపు చేతులు ఆనించి అడుగుతోంది.

'నాకేమీ పాలుపోవటంలేదే, వుత్తరం రాస్తే ఓ తంటా రాయకపోతే యింకో తంటా' మధు వెనక్కు తిరిగి ఆలోచనగా సుజాత కళ్ళల్లోకి చూస్తున్నాడు.

'మీరు మరీ భయస్థులు, మీరు వూరుకోండి, నేను రాస్తాను వుత్తరం...'

'అమ్మో యింకేమన్నా వుందా! కొంప మునిగిపోదూ...! అసలేమండిపడుతున్నాడు మనమంటే...'

'నిజం చెప్పండి వారి కోపానికి కారణం యేమిటి...'

'నిన్ను పెళ్ళి చేసుకోవటమే...' మధు గబుక్కున అనేశాడు.

'ఒక్క నాటికి కాదు. వారు చెప్పింది మీరు వినలేదని...'

'ఏదయితే యేముంది కనక...సుజాతా నాకో వుపాయం తట్టుతోంది. నువ్వు పాప వెళ్ళండి, నే నెమో...'

'అమ్మో మేమిద్దరమే, యింకేమన్నా వుందా? కొంప మునిగిపోదూ?'

మధు, సుజాతలు పకపక నవ్వారు.

'నేను యెన్ని విధాల ఆలోచించినా, మా నాన్న, నన్ను కనక చూశాడంటే మండిపడక మానడు. చివరకు తలాక మాట అనాలసి వస్తుంది. ఘర్షణ పెరిగి పోతుంది. ఇప్పుడవుతే తలోనియాల వున్నాం. దాని తర్వాత యీ మాత్రం మనశ్శాంతి కూడా వుభయులకు లేకుండా పోతుంది...' మధు విచారంగా కూర్చున్నాడు.

'అట్లా అని యీ విధంగా యెన్నాళ్లు కాలం గడుపుతాం...మీ అమ్మ, మీ నాన్న, మీ పెళ్లివిషయంలో యెంత తాపత్రయ పడ్డారో మీరే చెపుతూ వుంటారు గద!.. ...పోనీ తప్పో వప్పో, పెళ్లి క్షమించమని కోరితే......' సుజాత యేదో వుపాయం చెప్పినట్లు చెప్పింది.

'క్షమార్పణ కోరుకోవటానికి నేను యెప్పుడైనా సిద్ధమే...ఆనాడు నేను వెళ్ళిపోతుంటే, నా కంఠంలో ప్రాణం వుండగా యీ యింట్లో అడుగు పెటనివ్వను అన్నాడు మా నాన్న, ఆయన మహా పట్టుదల మనిషి. ఓసారి మా బాబాయికి మా నాన్నకు మాటా మాటా వచ్చి, యింతవరకు కూడా వాళ్లింటికి వెళ్లలా. మా బాబాయి యెన్నో విధాల బ్రతిమాలుకుని చెప్పాడు. మా నాన్న మాత్రం ఖచ్చితంగా సమాధానం చెప్పేవాడు రానని...నాకు భయంగా వుంటుంది ఆయన దగ్గరకు వెళ్ళటం అంటే...' మధు పిచ్చివాడులాగ అటూ యిటూ పచార్లు చేస్తున్నాడు.

సుజాతకూడా నిర్ఘాంతపడి నిలబడిపోయింది

ఇంతలో పాప తొట్లో మసలుతున్నాడు. గబగబ వెళ్ళి చిచ్చికొట్టింది సుజాత.

సుజాత 'మనస్సు అనేక విధాలుగా పోతోంది. నలుగుర్లోంచి వచ్చిన మనిషి మళ్లీ నలుగుర్లో ఉండాలని తాపత్రయ పడుతోంది. భర్త ఆఫీసునుంచి వచ్చే వరకు ఇంట్లో బిక్కు బిక్కుమని, ఆ పాపను పెట్టుకుకూర్చుంటే, ఆమెకు తృప్తిగా లేదు అత్త, మామ, ఆడబిడ్డా అందరూ వున్నారు కాని సుజాత అక్కడికి వెళ్లటానికి వీల్లేదు. వాళ్లు ఇక్కడికి వచ్చే అవకాశం కనిపించటంలేదు. సుజాత మధనపడినలిగిపోతోంది. ఉక్రోషం ఎక్కువయిపోతోంది. తనభర్తకు మామగారికి పోట్లాటఅవుతే, తనకు మామగారికి విరోధం ఏమిటి, తానే స్వయంగా వెళ్ళి, వాళ్లకు నచ్చచెప్పతాను. అప్పుడు కూడా ఆయన పట్టుదల వదలకపోతే! కొడుకునే వెళ్లగొట్టినవాడు, కోడలిని స్వీకరిస్తాడా! సుజాత పిచ్చి పిచ్చిగా యేవేవో ఆలోచించుకుంటోంది. పాప, నిద్రనుంచి లేచాడు. ఏడవటం మొదలు పెట్టాడు. పాపను సముదాయిస్తూనే, కళ్లు రెండు తుడుచుకుంది సుజాత.

ఆరుగంటలు కొట్టింది గడియారం. మధు ఇంటికి వచ్చేశాడు సుజాత మూతి ముడుచుకుని గదిలోనే కూర్చుంది.

మధు వచ్చినసంగతి గమనించి కూడా అక్కడనుంచి కదల్లేదు. మధు నాలుగు మూలలా చూస్తూ, గదిలోకి వచ్చాడు.

'ఇంట్లోకి ఇంకెవరు వచ్చినా ఇంతేగా' మధు సుజాతవైపుకు కోరగా చూశాడు.

'మీరు వస్తున్నట్టు చూశాను, అందుకనే తలుపుతీసి ఇక్కడకువచ్చి కూర్చున్నా...' ముభావంగా వూరుకుంది సుజాత.

'ఈ తెలివితేటలేమిటి...నీకు అక్కడికి వెళ్లి ఉండాలంటే, ఇవ్వాళే వెళ్లిపో, గుర్తుకోసం, ఈమె నాభార్య, వీడు నా కుమారుడు అని ఓ ఉత్తరంముక్క రాసిస్తా...' మధు కోపంగా అన్నాడు.

'అసలు మీరు వెళితేనే ఇదిలేదు. ఇక మీ ఉత్తరం...అలాంటి పరిస్థితే వస్తే, మేమే వెళ్లి, వీరు ఫలానా అని మిమ్మల్ని పరిచయం చేస్తాంలెండి, భయపడకండి...' సుజాత నవ్వుతూ అంది.

మధు కోపమంతా దిగజారిపోయింది.

'నలుగురు నన్ను అడుగుతున్నారండి. మీ అత్తగారు, మీ మామగారు ఎక్కడని. వాళ్లందరికీ సమాధానాలు చెప్పలేక సతమతమయిపోతున్నాను...' సుజాత విసుగ్గా అంది.

'రేపటినుంచి, అట్లా అడిగేవాళ్లందరినీ, నాదగ్గరకు పంపించు. నేను సమాధానం చెప్పి పంపిస్తా...' మధు ధీమాగా అన్నాడు.

'నన్ను అడిగేవాళ్లు, మీ దగ్గరకు వచ్చి అడుగుతారేమిటి...మిమ్మల్ని అడిగేవాళ్లు మీకుమాత్రం లేరేమిటి...'

మధు ఉక్కిరి బిక్కిరి అయిపోయాడు.

'ఉండరా వకటే యేడుపు నువ్వు... తాతగారిదగ్గరకు తీసుకు వెళతానే...ఏడవకమ్మ ఏడవక...' సుజాత లాలిపాట పాడుతోంది.

'మనం తింటే చాలు చివాట్లు...అర్థం శుభం తెలీని ఆ పసిపాపకుకూడా చివాట్లు పెట్టించాలేమిటి...' మధు పాపను తీసుకున్నాడు.

'నేను యెంతసేపు ఆలోచించినా, వకటే వుపాయం తట్టుతోంది. మనం ముగ్గురం వెళ్ళటం, క్షమార్పణ కోరుకోవటం, అప్పటికీకూడా అంత కఠినంగానే వుంటే, తర్వాతసంగతి తర్వాత చూసుకుందాం...' సుజాత నిర్ణయాన్ని ఖచ్చితంగా చెప్పేసింది.

# ★ తగని బంధం ★

మధుకూడా యీ సలహాకు సమాధాన పడుతున్నా ఓ మూల భయంగానే వుంది.

'తీరా మనం వెళ్ళి, వాళ్లను రెచ్చగొట్టిన వాళ్ళం అవుతామేమోనని భయంగా వుంది....' మధు సందిగ్ధంగా అన్నాడు.

'ఆ పిల్ల పెళ్లియిందండీ...' సుజాత హఠాత్తుగా ఓ ప్రశ్న వేసింది.

'ఏ పిల్ల?...'

'మీ నాన్నగారు కోడలుగా చేసుకుందామనుకున్న పిల్ల...'

'ఏమో యెవరికి తెలుసు? ఆ నాడు పెళ్లిచూపులకంటూ వెళ్లాను. తర్వాత వాళ్ళ విషయమే నాకు తెలీదు...అయినా, ఆ పిల్ల పెళ్ళిమాట యిప్పుడెందుకు వచ్చింది...'

'ఆ అమ్మాయి పెళ్ళికనక అవుతే, మీ నాన్నగారు కొంచెం శాంతిస్తారేమోనని...'

'ఆ అమ్మాయి పెళ్ళి దిగులు మా నాన్నకేం పట్టా నేను ఆ అమ్మాయిని పెళ్ళి చేసుకోవాలని మాత్రమే ఆయన పట్టుదల అది కాస్తా యెదురు తిరిగింది...'

'నన్నింతవరకు మామగారు చూడ లేదుగా...'

'ఆ...చూస్తే, నీ అందంచూసి మూర్ఛపోయి, రారానాయనా, యెంత అందమైన భార్యను కట్టుకున్నావురా అని నెత్తిన యెక్కించుకుంటాడు; అంతేనే నీ వుద్దేశం...' మధు ఆపుకుని ఆపుకుని నవ్వాడు

'నా అందం చూసి మూర్ఛపోవలసినవారే, మూర్ఛపోవటం లేదు... ఇంకా మిగతా వాళ్ళ సంగతి నాకెందుకు...' సుజాత కోపంతో అన్నది.

'నీకు అంత మోజుగా వుంటే, నీ అందాన్నిగురించి తీరుబడిగా ఓ రోజు పొగడతాలే, నువ్వు భయపడక...'

'ఈ మాటలకేం కానీండి, మనం యెట్లాగైనా వెళ్ళి తీరాలి.' సుజాత గట్టిగా పట్టు పట్టింది.

ఆ రాత్రంతా మధు ఆలోచిస్తూనే పడుకున్నాడు. మధుకు వేరే గత్యంతరం లేక సరేనంటూ ఒప్పుకున్నాడు. అయితే ఓ షరతుమాత్రం పెట్టాడు: 'ఆయన యేమన్నా మనం మాట్లాడకూడదు. అంత పెడసరంగా వుంటే మాత్రం మెదలకండా మన దారిన మనం వచ్చెయ్యటమే గాని ఆయనతో ఘర్షణ పెట్టుకోకూడదు' ఈ రెంటికి సుజాత కూడా అంగీకరించింది.

వాకిట్లోకి బండీవచ్చి ఆగింది. నాలుగుతలుపులు వేసి, తాళం గట్టిగా వేశానో లేదోఅని రెండు మూడుసార్లులాగిచూసి, మధుకూడా బండీ యెక్కాడు. బండీ యెక్కాడన్నమాటేగాని, మధుకు బెరుకుగానే వుంది జరగబోతా యనుకుంటున్నవన్నీ కళ్ళకు కట్టినట్లు కనిపిస్తున్నాయి మధుకు. రైలు స్టేషను వచ్చేలోగా, మధు, సుజాత ఎంతో ఘర్షణ పడ్డారు. ఓ సమయంలో, 'నేను రానులే' అంటూ మధు బండీకూడాదిగాడు మళ్ళీ యేమనుకున్నాడో యేమో మెదలకండా వచ్చి బండీలో కూర్చున్నాడు. మనస్సు వెనక్కు ముందుకు లాగుతున్నా, బండీమాత్రం, ముందుకే పోయి స్టేషనుదగ్గర ఆగేసింది.

ఇక రైల్లో యెక్కినప్పటినుంచి, మధు ఆవేదన యెక్కువయిపోతోంది. సుజాత పిరికితనాన్ని వెనక్కు నెట్టేసుకుని, హృదయం చిక్కబట్టుకుని, బింకంగా కూర్చుంది. ఓ వింతైన ధైర్యాన్ని తెచ్చుకుంటోంది. ఎంత ప్రతికూల వాతావరణం కృత్రిమంగా కనిపిస్తోందో, అంతగా ధైర్యం తెచ్చుకుంటోంది. మధు పిరికితనానికి తోడుగా అలాంటి భయ సందేహాల్నే తెచ్చుకుంటు న్నాడు. రైల్లో మాత్రం, ఇద్దరూకూడా ఎవరిమనస్సుల్లో వాళ్లు ఆలోచించుకుంటూ నిశ్శబ్దంగా కూర్చున్నారు. వచ్చిపోతున్న స్టేషన్ల ఆమాత్రకూడా మధు పట్టించుకోవటం లేదు సుజాత, బండీ ఆగినప్పుడల్లా కిటికీలోంచి బైటకు చూసి ధైర్యాన్ని తెచ్చుకుంటోంది మధు పరధ్యాన్నంగా వుండటంచూసి, సుజాత ఒకటి రెండు సార్లు మెల్లిగా హెచ్చరించింది, ఇంకా యెన్ని స్టేషన్లు ఉన్నాయో గమనిస్తున్నారా అని. మధుకు ఇంకా పిరికితనం ఎక్కువయిపోతోంది. సుజాత ధైర్యంతోను, మధు పిరికితనంతోను సంబంధం లేకుండానే, రైలు కాస్తా భట్టిప్రోలుస్టేషన్లోవచ్చి ఆగింది మధు గభాలున ఉలిక్కిపడ్డాడు సుజాత, పాపను హృదయానికి గట్టిగా అదుముకుని లేచి నిలబడింది. ఓ కూలిమనిషి చిన్నపెట్టెను, నెత్తిమీద పెట్టుకుని ప్లాటుఫారం మీద నిలబడ్డాడు. రైలు పెద్దకూత వేసి, నడక సాగించింది. పోతున్న రైలువైపు దిగాలపడి చూస్తూ, నుంచున్నాడు మధు కూలీమనిషి నడవండీ అన్నాడు. మధు తత్తరపడుతూ టిక్కట్లు గేటులో ఇచ్చేసి, బైటపడ్డాడు. మధుకు అంతా అయోమయంగావుంది. ఆ వూరును వదిలిపెట్టి, సుమారు ఏడాదిపైన అయింది. ఆ వూళ్లో అన్నీ తనకు పరిచితాలే. కాని ఈ ఏడాది ఎడబాటుతోను తనలో ఎంతో మార్పు వచ్చేసింది తనకు సన్నిహితులైన వాళ్లెవరూ కనిపించలేదు. తనతో పరిచయం ఉన్నవాళ్లు కూడా, చూసీ చూడకుండా తలలు వంచుకుని వెళ్ళిపోతున్నారు. ఆ రోడ్డు, ఆ కాలవ, ఆ మార్కెట్టు ఇంకా అనేకమైన అచేతనాలు, మధుకు అతి సన్నిహితం అయినాయి. తాను, తన తలిదండ్రులకే దూరమయిపోయాడు, ఇంక ఇతరులు తనకు దూరంకావటంలో ఆశ్చర్యమేముంది అనుకున్నాడు అడుగుల్లో అడుగులు వేసుకుంటూ, బండీవెనకాల వస్తున్నాడు.

'ఏమిటండీ, ఈవూరు వచ్చేసిన తర్వాత కూడా ఇంకా భయమేమిటి, మీరుకూడా బండీ ఎక్కండీ' అన్నది సుజాత.

ఆ మాటలు విని బండీవాడు ఎద్దును ఆపేశాడు. వంకరలు వంకరలు తిరుగుతూ, బండీ కాస్త, మారుమూలగా వున్న మండువా యింటిదగ్గర ఆగింది.

మధు తడబడుతూ దిగాడు. అతని ఆలోచనలన్నీ యింకో విధంగా మారిపోయినాయి ఆ వూరుమాటే మరిచిపోయాడు. తండ్రి అన్న మాటలు, చెవుల్లో గింగురుమన్నాయి

(56 పేజీ చూడండి)



మద్రాసు సోల్ ఏజంట్లు. దాదా & కంపెని పార్కుటౌన్, మద్రాసు-3.

# కవి చక్రవర్తి

మహౌదార్యం ఛాయా మాత్రంగానైనా భావించనీయలేదు! మహాప్రభూ! నీ వితరణ నిశ్శబ్ద జలధరవర్షం! నీ అనుగ్రహం ఫలరూపంలోనే ప్రత్యక్షమైనది!" అని ఆ శ్లోక తాత్పర్యం.

అటుపిమ్మట వెంటనే సర్వమంగళకీ శుభవార్త తెలియజెయ్యడానికై జవనాశ్వాలపై నలుగురు వేగయిరులను ఉజ్జనీనగరానికి పరిగెత్తించాడు.

సర్వమంగళకే మాత్రం ఆరోగ్యంగా ఉన్నా వెంటనే ఆమెను కాశ్మీరానికి తోడ్కొనిరావలిసిందని ఆజ్ఞాపించాడు. ఒక వేళ శరీరారోగ్యస్థితి దీర్ఘ ప్రయాణానికి అనుకూలం కాకపోతే ఆమె చికిత్సకై ఉజ్జయినీ నగరంలో రాజవైద్యుల నేర్పరచవలిసిందని ఆజ్ఞాపించాడు. అటుపిమ్మట పదిహేను రోజుల వరకు నిద్రాహారాలు లేకుండా ఆ వేగరులరాకకోసం ఎదురు తెన్నులు చూచాడు. ఆ పదిహేను రోజులు అతని కొక మహాయుగాలుగా గడిచాయి. చివరికి వేగరులు వచ్చారు.

మాతృగుప్తుడు కాశ్మీరానికి బయలుదేరి వెళ్ళిన మరునాటినించీ సర్వమంగళరోగం మళ్లీ తిరగబెట్టింది. క్రమంగా అది బాగా ముదిరిపోయింది. అందరు ఇక ఆమె జీవించదని నిశ్చయించారు. ఇంతలో వేగరు లతి కష్టంమీద ఆ శుభవార్త ఆమెచెవిలో వేశారు. ఆ మాట వినీ వినగానే ఆమె ముఖంలో ప్రత్యూషపు ఒక్కసారిగా తామరపూవులా వికసించింది! మరుక్షణంలో ఆ ఆనందాఘాతం ఆమె హృదయానికొక వజ్రాఘాతంలా పరిణమించింది. వెంటనే ఆమె మరణించింది. వేగరులా వృత్తాంతం అంతా చక్రవర్తికి విన్నవించారు.

మాతృగుప్త చక్రవర్తి ఆ మాట వింటూనే మొదలు నరికిన తరువులా అక్కడే కూలబడిపోయాడు!

—మిగిలిన కథ పైవారం

స్థాపితము: 1920 సం॥రం.
సమస్త చర్మవ్యాధులకు, తెలుపు మచ్చలు వగైరాలకు చికిత్సా నిపుణులు.
కేటలాగు, సలహా ఉచితము.
రెడ్డి & కో, (రిజిష్టర్డు)
గోపాలపురం, తూర్పు గోదావరి జిల్లా
(వయా) తణుకు.

# తెగని బంధం

(26-వ పేజీ తరువాయి)

'సుజాతా, నువ్వు ముందర వెళ్లు...' మధు సుజాత కళ్ళల్లోకి ప్రాధేయ పడుతున్నట్లు చూశాడు.

'మరీ అంతయిదా...మీరు ముందర వెళ్ళండి...పరిస్థితినిబట్టి నేను వస్తాను. ముందర మాత్రం, నేను, పాప, మావగారికి కనిపించకూడదు......' సుజాత, మధును ముందుకు నెట్టింది.

భార్యదగ్గర కొంచెమన్నా ధైర్యం చూపించాలనుకుని, మనస్సు చిక్కబట్టుకుని, మధు లోపలికి వెళ్లాడు సరాసరి.

'అబ్బాయీ వచ్చావురా నాయనా...' అంటూ అమాంతం మధును కౌగలించుకుని లలితమ్మ ఏడ్చింది.

'ఎవరూ యేమిటి...' వర్మ గబగబ గదిలోంచి వచ్చాడు.

'నాన్నా...' మధు గట్టిగా అరిచాడు.

'నాన్నా...ఛీ...అవతలకు పో...మళ్ళీ నీ మొహం చూడటమూ...సిగ్గులేదూ...ఏ మొహం పెటుకు వచ్చావు...' వర్మ గబగబ అనేస్తున్నాడు.

'వూరుకోండీ...అంత కఠినమా!...కన్న కొడుకుమీద ఆ మాత్రం కనికరం చూపకూడదూ....' లలితమ్మ, వర్మను ఆపటానికి ప్రయత్నం చేస్తోంది.

'నీ చనువుమూలానే యింతవరకు వచ్చింది...' నువ్వుకూడా వాడితో వెళ్లిపో, నేను వక్కణ్ణే యీ యింట్లో వుంటా...' వర్మకు ఆవేశం అధికమయిపోతోంది.

మెల్లిగా, సుజాత, పాపను చంకనపెట్టుకుని తలుపు చాటుగా నిలబడింది.

వర్మ కళ్లు అప్రయత్నంగా వీళ్ళిద్దరిమీద పడ్డాయి.

'ఎవరూ...' కంఠం తగ్గించి అన్నాడు వర్మ.

గబుక్కున తలుపుచాటునుంచి సుజాత లోపలికి వచ్చేసింది.

వర్మ, ఆశ్చర్యంగా సుజాత కళ్లల్లోకి చూశాడు. సుజాత చంకలోపాప 'తా..త' అంటూ అక్షరాలు విడివిడిగాఅంటున్నాడు.

'అమ్మాయి...ఎవరు...?'

'మీ మనమడు...' పట్టు బలవంతాన దుఃఖము ఆపుకుంటూ సుజాత అంటూ మావగారి కాళ్లమీద వరగబోయింది.

'అయ్యో! పాప పడిపోతాడు...,అంటూ అమాంతం, సుజాత చేతులోంచి పాపను వర్మ తీసుకుని తన గుండె మీదకు తీసుకున్నాడు.

'అమ్మాయీ...రా...వీడు నావాడు... వీడికోసనే నేను ఇంకా బ్రతికివున్నా...' అంటూ గట్టిగా పాపణ్ణి హృదయానికి అద్దుకున్నాడు వర్మ సుజాత తల నిమురుతూ.

సుజాత అమాంతంగా లలితమ్మ వళ్లో పడింది. ★

# జూల్స్ వెర్న్

(27 వ పేజీ తరువాయి)

80 రోజులలో ప్రపంచయాత్ర' అనే మరో పుస్తకం రాశాడు. ఆ పుస్తకం పత్రికల్లో సీరియల్ గా ప్రచురించే రోజుల్లో పారిస్ ప్రజ లందరు ఆ పత్రిక కోసం కాచుకొని కూర్చునేవారట!

తరవాత జూల్స్ వెర్న్ 'ట్వంటీ థౌజండ్ లీగ్స్ అండర్ దిసీ' అనే పుస్తకం రాశాడు. గ్రంథ కర్త ఆ పుస్తకంలో ఒక జలాంతర్గామి సృష్టించాడు. అటుపిమ్మట ఎంతో కాలందాకా నిజమైన జలాంతర్గామి తయారు చెయ్యడం జరగలేదు.

అతడు రచించిన ఇంకొక చిన్న పుస్తకంలో న్యూయార్కు నగరం ప్రపంచ ప్రధాన నగరంగా పెంపొందగలదని వ్రాశాడు. క్రమక్రమంగా శీతోష్ణ స్థితి మార్చే మార్గాలు కనుగొనగలరనీ ఉత్తర ధృవం దగ్గరకూడా పంటలు పండించగలరనీ మేఘాలమీద వ్యాపార ప్రకటనలు వెలువడగలవనీ ఆ పుస్తకంలో వ్రాశాడు. దానిలో కథా నాయకుడు ఒక 'ప్రపంచ పత్రిక'కు సంపాదకుడుగా పని చేస్తాడు. దానికి రోజుకు 8 కోట్లమంది పాఠకులు. ఆ పత్రికలో అంగారకుడు, బృహస్పతి మొదలైన గ్రహాలనించివచ్చిన వార్తలుకూడా ప్రచురిస్తారు.

పాపం జూల్స్ వెర్న్ వార్ధక్యం అంతగా సుఖంగా గడవలేదు. పెద్ద పెద్ద మేధావులతన్ని హేళనచేసేవారు. ఆ రోజుల్లో అతని పుస్తకాలే బాగా యెక్కువగా అమ్ముడు పోయేవి. అయినా అతనికి ఫ్రెంచి ఎకడమీ సభ్యత్వం లభించలేదు. క్రమ క్రమంగా అతని జీవితంలో కష్టా లెక్కువయాయి. దృష్టి మందగించింది. అతడు చిట్టచివర వ్రాసిన పుస్తకంలో ప్రపంచంలో క్రమ క్రమంగా నియంతల రాజ్యా లేర్పడగలవని జోస్యం చెప్పాడు.

జూల్స్ వెర్న్ 1905 లో చనిపోయాడు. బ్రతికి ఉండగా అతన్ని వేళాకోళం చేసినవారందరు ఎంతో గౌరవంగా అతని మృతదేహంవెంట నడిచి వెళ్లారు. ఇంకా రాజప్రతినిధులు మొదలైనవారెందరో ఆ నాడక్కడికి వచ్చారు. ★

Printed and Published for Nageswara Rao Estates (Private) Ltd., by S. Radha Krishna at The Patrika Andhra Press, 6 & 7, Thambu Chetty Street, Madras-1. Editor S. Sambhu Prasad.